

సమ్మక్క దేవతను దర్శించుకుంటున్న భక్తులు

## వనదేవతలకు కొనసాగుతున్న మొక్కులు

**భారీగా తరలివచ్చిన భక్తులు**

తాడ్వాయి, ఫిబ్రవరి 16 : మేడారం సమ్మక్క, సారలమ్మల మినీ జాతర ముగిసినా భక్తుల మొక్కులు కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవుదినం కావడంతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించిన అనంతరం తల్లుల గద్దెల వద్దకు చేరుకున్నారు. సమ్మక్క,సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై పసుపు, కుంకుమలు, చీరె, సారె, పూలు, పండ్లు సమర్పించిన గిరిజన సంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవార్ల దర్శనానికి అధికసంఖ్యలో తరలిరావడంతో మేడారం జాతర పరిసరాలు రద్దీగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ములుగు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



నాగులమ్మకు ముడుపు కడుతున్న యువతి

**తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రులకు అప్పగింత..**

వనదేవతలను సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు వచ్చిన నాలుగేళ్ల చిన్నారి తప్పిపోగా పోలీసులు పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటకు చెందిన హాఫీయా-రాజు దంపతులు అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చారు. అమ్మవార్లను దర్శించుకునే క్రమంలో పాప వారి నుంచి తప్పిపోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఆరగంటలోపే చిన్నారిని గుర్తించారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్ చేతుల మీదుగా చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా చిన్నారిని గుర్తించి అప్పగించిన పోలీసులకు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీఎస్పీ రవీందర్

## మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న నాయకులు

చిట్యాల, ఫిబ్రవరి 16 : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను చిట్యాల మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించారు. తిరుమలపురంలో మడిపడిగ లక్ష్మీనారాయణ, చిట్యాల మండల కేంద్రంలోని పిట్టల రమేశ్ కూతురు అఖిలశ్రీ, రామ్‌నగర్ కాలనీకి చెందిన ఆరెపల్లి ఎల్లయ్య, గోపాలాపూర్‌లో మహ్మద్ రుక్ముద్దీన్ వివిధ కారణాలతో మృతి చెందారు. ఆదివారం మృతుల కుటుంబాలను గొర్రె సాగర్, బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ పరామర్శలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేశ్, మాజీ ఎంపీటీసీ జంబుల తిరుపతి, చిట్యాల టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, గోపాలపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండ కృష్ణ, నాయకులు శ్రీరామ్ సదయ్య, గోవిందుల నాగరాజు, గుండవెన రమేశ్, ఏకు అనిల్ పాల్గొన్నారు.

## గ్రీన్ ఇండియా చాలెంజ్ పోస్టర్ ఆవిష్కరణ

ములుగురూరల్, ఫిబ్రవరి 16 : గ్రీన్ ఇండియా చాలెంజ్ పోస్టర్లను ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆవిష్కరించారు. తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోశ్‌కుమార్ కోటి వృక్షార్చన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ఈ పోస్టర్లను ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, నాయకులు గరిగె రఘు, వేముపల్లి భిక్షపతి, గొర్రె సమ్మయ్య, యూనిస్, సురేశ్‌రెడ్డి, దేవర రాజు, విజయ, స్వరూప, సిద్ధు, గ్రీన్ చాలెంజ్ ములుగు ఇన్‌చార్జి లంజపల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బడే నాగజ్యోతి

# జాతీయ రహదారిపై మళ్లీ పగుళ్లు..!

- తాడ్వాయి నుంచి ఏటూరునాగారం బీటీ లేయర్ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు
- ప్రారంభంలోనే వెలుగులోకి తెచ్చిన 'నమస్తే తెలంగాణ'
- స్పందించి దెబ్బ తిన్న రోడ్డును సరిచేసిన అధికారులు
- ప్రస్తుతం మళ్లీ అదే తప్పిదం..
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో ప్రయాణికులు







ఏటూరునాగారం-చిన్నబోయినపల్లి మధ్యలో కంకర తేలి, పగుళ్లు ఏర్పడ్డ జాతీయ రహదారి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 16 : జాతీయ రహదారిపై వేస్తున్న బీటీ లేయర్ పగుళ్లు తేలి మళ్లీ లేస్తుంది. పలు చోట్ల నెర్రలు బారుతోంది. తాడ్వాయి నుంచి ఏటూరునాగారం వరకు రూ.9కోట్లతో బీటీ లేయర్ పనులను జాతీయ రహదారి విభాగం నుంచి మంజూరు చేశారు. చిన్నబోయినపల్లి-తాడ్వాయి మధ్యలో రెండు ఇంచుల మందంతో బీటీ లేయర్ వేస్తున్న క్రమంలో అనేక చోట్ల ఒక వైపు వేస్తుంటే మరో వైపు లేచిపోయింది. ఇది ప్రమాదకరంగా మారింది. అప్పుడే 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కావడంతో దెబ్బతిన్న చోట తొలగించి మళ్లీ వేశారు. ఇక ప్రస్తుతం ఏటూరునాగారం-చిన్నబోయినపల్లి మధ్యలో బీటీ లేయర్ పనులు జరుగుతున్నాయి. ఏటూరునాగారం నుంచి ఐదో కిలో మీటర్ దాటిన తర్వాత వేసిన బీటీ లేయర్ అనేక చోట్ల పగుళ్లు తేలి రోడ్డు అధ్వానంగా మారింది. తారులో కలిపిన కంకర లేచి ప్రమాదకరంగా మారుతోంది. రోడ్డు మధ్యలో, చివర్ల పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. బీటీ లేయర్ వేసిన వెంటనే భారీ వాహనాలు వెళ్లడం వల్ల దెబ్బతిన్నట్లు అధికారులు గతంలో వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తాడ్వాయి- చిన్నబోయినపల్లిలో అదే పరిస్థితి నెలకొంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. నాసిరకం బీటీ మిక్సింగ్ ఉండడం వల్ల కింద ఉన్న రోడ్డుకు సరిగా పట్టుకోకపోవడం వల్ల ఇలా పగులుతుందా? నాసిరకంగా లేయర్ వేస్తున్నారా..? అనే విషయాన్ని క్వాలిటీ కంట్రోల్ అధికారులే తేల్చి చెప్పాల్సిన అవసరం ఉంది. వేస్తున్న రోడ్డు అప్పుడే పగుళ్లు తేలి ప్రమాకరంగా మారిన తీరుపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసే సింగిల్ రోడ్డు కంటే జాతీయ రహదారి రోడ్డు అధ్వానంగా వేస్తున్నట్లు ఈ రోడ్డును చూస్తే అర్థమవుతున్నది. మేడారం జాతర సందర్భంగా ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, ఆటోలు, బస్సులు నిత్యం వేల సంఖ్యలో నడుస్తున్నాయి. వీటి రాకపోకలతో రోడ్డు మరింత పగుళ్లు తేలి ప్రమాదకరంగా మారుతున్నది. అధికారులు స్పందించి పగుళ్లు ఏర్పడకుండా నాణ్యతతో కూడిన రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

## 'వార్డెన్ నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి'

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 16 : వార్డెన్ నిర్లక్ష్యంతో ఆదివాసీ విద్యార్థి మృతి చెందాడని, నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్(జీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయిదొర ఆరోపించారు. ఆదివారం ఆయన కొమురంభీం కాలనీలో మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థి సోయం వినీత్ మృతి కేవలం ఉద్యోగుల నిర్లక్ష్యం వల్లనే జరిగిందన్నారు. వాజేడు మండలం పేరూరు ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వీనిత్ కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నప్పటికీ అక్కడ ఉన్న వార్డెన్, హెచ్ఎం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. కేవలం ఆశ వర్కర్ ఇచ్చిన మందులతోనే గడిపారని, సరైన చికిత్స సమయానికి అంది ఉంటే విద్యార్థి మృతి చెందేవాడు కాదని అన్నారు. జ్వరం వచ్చిన విషయాన్ని తల్లిదండ్రులకు సైతం చెప్పలేదన్నారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలను డీడీ పర్యవేక్షించాలని, ఇందులో ఆయన లోపం కూడా ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జీఎస్పీ కార్యకర్తలు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న మున్నూరు కాపు సంఘం నాయకులు

## కుల గణన రీ సర్వే చేయాలి

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 16 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల గణన సర్వేలో మున్నూరుకాపు కుల జనాభాను మూడున్నర శాతం తక్కువగా చూపించడం సరికాదని, కుల గణనను రీ సర్వే చేయాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం భద్రాచలం నియోజకవర్గ కోఆర్డినేటర్ దనపనేని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50లక్షల పై చిలుకు ఉన్న తమ కులస్తులను తక్కువగా చూపించారని ఆరోపించారు. దీంతో తమకు తీవ్ర అన్యాయం జరగనున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాఏశంలో మండల అధ్యక్షుడు జక్కుల శ్యామ నాయకులు కూసం సాంబం, సత్తిబాబు, సుంకరణాలాజీ, రంగయ్యనాయుడు, దనపనేని నాగరాజు, దేవరకొండ ధనలక్ష్మి, పెనుమచ్చ మాధురి, జలిగంపల కళాధర, జెజ్జణి పూర్ణ, పడాల రమేశ్, బాసాని రమేశ్, జాపతి వెంకటేశ్వర్లు, నర్సింగుల రాము తదితరులు పాల్గొన్నారు.

## పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో సమస్యల తిష్ట

- విద్యార్థులకు సక్రమంగా అందని మెనూ
- అపరిశుభ్రంగా హాస్టల్ పరిసరాలు
- ప్రమాదభరితంగా విద్యుత్‌వైర్లు



పేరూరు గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల

వాజేడు, ఫిబ్రవరి 16 : మండలంలోని పేరూరు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలుర గిరిజన వసతి గృహం(ఆశ్రమపాఠశాల) అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నది. ఇదే హాస్టల్‌కు చెందిన విద్యార్థి సోయం వినీత్ జ్వరంతో బాధపడుతూ శనివారం మృతి చెందగా ఆదివారం బంధువులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' క్షేత్ర పరిశీలన చేయగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. వాజేడుతోపాటు వెంకటాపురం తదితర మండలాలకు చెందిన పలువురు విద్యార్థులు ఈ హాస్టల్‌లో చేరి విద్యాభ్యాసం చేస్తున్నారు. మారుమూల ప్రాంతంలో హాస్టల్ ఉండడంతో అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. మెనూ సక్రమంగా అందడం లేదని, కోడిగుడ్లు, చికెన్ అందించడం లేదని పలువురు విద్యార్థులు ఆరోపించారు. హాస్టల్ పరిసరాలతోపాటు విద్యార్థులు నిద్రించే గదులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్‌వైర్లు సైతం బయటకు వచ్చి ప్రమాదకరంగా కనిపించాయి. విద్యార్థులు భోజనం చేసిన అనంతరం హ్యాండ్ వాష్ చేసుకునే ప్రదేశం అస్తవ్యస్తంగా, అపరిశుభ్రంగా ఉంది. అధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు మెనూ సక్రమంగా అందించాలని పలువురు కోరుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న హ్యాండ్ వాష్ ప్రదేశం

## మోరంచ వాగులోకి కేటీపీపీ రసాయనాలు

**ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు**

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుంచి పలు రసాయనలతో కూడిన వ్యర్థా పదార్థాలు, పలు రసాయనాలు మోరంచ వాగులోకి వదులు తుండడంతో మోరంచవాగు ఆయకట్టు కింద ఉన్న పలు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలు, యాష్ బురదను వదులు తుండడంతో మోరంచవాగు కలుషితం అవుతున్నది. మోరంచవాగు నీటి ప్రవాహంతో వస్తున్న యాష్ బురదలో రైతులకు చెందిన విలువైన వ్యవసాయ మోటార్లు కూరుకు పోతున్నాయి. దీంతో పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. కలుషితమైన నీటితో పంటలు రోగాల బారిన పడి రైతులకు తీరని నష్టం వాటిల్లుతున్నది. విషయాన్ని కేటీపీపీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని మోరంచవాగు ఆయకట్టు కింద గల దుబ్బపల్లి, ఎస్ఎం కొత్తపల్లి, దూద్‌పల్లి, ఒడితల, పాసిగడ్డతండా, గుడాడ్‌పల్లి, గొర్లవేడు, చైన్‌పాక,నైన్‌పాక రైతులు కోరుతున్నారు.



వరి పొలంలోకి చేరిన యాష్ బురద



విద్యార్థులకు పులిహోర ప్యాకెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

## ప్రశాంతంగా ముగిసిన సీవోఈ ప్రవేశ పరీక్ష

కాటారం, ఫిబ్రవరి 16 : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఆదివారం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ)ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 320మంది విద్యార్థులకు గాను 295మంది విద్యార్థులు హాజరు కాగా, 25మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ రాజేందర్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ మాధవి, పరిశీలకులు నాగమణి తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు పరీక్ష అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ ఎన్ నరేశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

గణపురం, ఫిబ్రవరి 16: ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన మోటపోతుల రాజు(36) ఆదివారం సాయంత్రం ట్రాక్టర్‌పై మైలారం వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో రాజు ట్రాక్టర్ కింద పడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108వాహనంలో భూపాలపల్లి వంద పడకల ఆసుపత్రికి తరలించగా అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాజుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రాజు మృతితో గాంధీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సీల్డ్ టెండర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 16 : మండలంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వర ఆలయానికి సంబంధించిన వివిధ రకాల సామగ్రిని అందించేందుకు సీల్డ్ టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూలు, పూల దండల సప్లై, కూరగాయలు, కర్ర సామగ్రి, లడ్డు, పులిహోర ప్రసాదం కవర్స్, బాక్సలు, టికెట్ బుక్స్, ఓచర్, స్టాక్ రిజిస్టర్, పాలు, పెరుగు, ఫ్లెక్సీలు, ఫ్లెక్సీ బోర్డుల సప్లై కోసం ఈ నెల 21న ఉదయం 10గంటలకు టెండర్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆకస్తిగల వారు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## అడవిలో మంటలు ఆర్పిన అధికారులు

వాజేడు, ఫిబ్రవరి 16 : మండలంలోని దూలపురం అటవీశాఖ రేంజ్‌పరిధిలోని పెనుగోలు గుట్టల సరిహద్దు అటవీప్రాంతంలో ఏర్పడిన మంటలను స్థానిక అటవీశాఖ అధికారులు ఆదివారం గుర్తించి ఆర్పివేశారు. అడవుల సంరక్షణ అందని బాధ్యత అని, అడవిలోకి వచ్చే వారు మంటలు పెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి బాలకృష్ణ, ఎఫ్‌బీవోలు వాసుబాబు, లలిత, హతిరామ్, సంతోష్ పాల్గొన్నారు.

## టీజీ ఎండీసీ పీవోపై బదిలీ వేటు

**నూతన పీవోగా రంగారెడ్డి నియామకం**

మహదేవపూర్(కాళేశ్వరం),ఫిబ్రవరి 16 : జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల టీజీఎండీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ కే శ్రీరాములపై బదిలీ వేటు పడింది. శ్రీరాములను నల్గొండ జిల్లా పీవోగా బదిలీ చేయగా, ఆయన స్థానంలో నల్గొండ పీవో పీ రంగారెడ్డి బదిలీపై ఇక్కడికి రానున్నారు. కొంతకాలంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఇసుక క్వారీల్లో జరుగుతున్న అక్రమాలు, అక్రమ వసూళ్ల దందాపై పీవోపై అనేక విమర్శలు వెల్లువెత్తగా క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. పలు ఆరోపణ నేపథ్యంలో అధికారులు సమగ్ర విచారణ చేపట్టి పీవోపై బదిలీ వేటు పడినట్లు తెలిసింది.

## కూలీలకు త్వరగా వేతనాలు అందించాలి

టేకుమట్ల, ఫిబ్రవరి 16 : ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలందరికీ సకాలంలో వేతనాలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో నరేశ్ అన్నారు. మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం నాలుగో సామాజిక తనిఖీ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రజావేదిక ఆదివారం ఎంపీడీవో అధ్యక్షతన జరుగగా డీఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన అవకతవకలను డీఆర్పీలు చదివి వినిపించగా మళ్లీ ఇలాంటి పొరపాట్లు జరగకూడదని డీఆర్డీవో పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్పీ, డీఆర్పీ, ఎఫ్ఏ, కార్యదర్శులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం (17వ తేదీ) నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో జిల్లా యంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 16 : ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పస్రా ఎస్సై ఏ కమలాకర్ హెచ్చరించారు. ఆదివారం పస్రా పీఎస్ పరిధిలో సిబ్బంది కలిసి జాతీయ రహదారిపై ఇసుక లారీలను తనిఖీ చేశారు. లారీల యజమానులు డీడీలు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. ఒక లారీకి బదులు మరొక దానిలో ఇసుకను తరలించినా, ఓవర్ లోడ్ ఉన్న జేసీబీ లోడింగ్ చార్జీల పేరుతో అక్రమ వసూళ్లు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## ఎన్ఎంఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

ములుగురూరల్, ఫిబ్రవరి 16 : బండారుపల్లి మోడల్ పాఠశాలలో 8వ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్ దేవిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నెలకు రూ.1000 చొప్పున సంవత్సరానికి రూ.12వేలు ఎంపికైన పెద్దపల్లి హర్షిత, అజ్మీరా శ్రీరామ్, పత్తి తన్మయిలకు అందనున్నట్లు తెలిపారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

## పార్కులోని సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : భూపాలపల్లి పట్టణంలోని జయశంకర్ పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జయశంకర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రొడ్డ రవీందర్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియా మాట్లాడుతూ వాకింగ్ చేసే ట్రాక్ లేకపోవడంతో పార్కుకు వచ్చే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన వస్తువులు పూర్తిగా పాడైపోయాయన్నారు. వెంటనే మున్సిపల్, సింగరేణి అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జయశంకర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో 2కే రన్ ర్యాలీ తీస్తున్న హెచ్‌పీసీఎల్ డీలర్లు

## పర్యావరణాన్ని పరిరక్షించాలి

**హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో 2కే రన్**

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 16 : ప్రజలు డీజిల్, పెట్రోల్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గల హరీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కేంద్ర ఇంధనశాఖ ఆదేశాల మేరకు హెచ్‌పీసీఎల్ సంస్థ ఆధ్వర్యంలో సంక్షమ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డీలర్లు అశోక్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : మంచిర్యాల జిల్లాలోని గిద్దెరేగడి ఓఆర్ఆర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్‌లో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న సింగరేణి కార్మికుడు ఓంకార్ మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాలో జరిగిన బంధువుల పెళ్లికి ఓంకార్, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి కారులో వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లాలోని గిద్దెరేగడి ఓఆర్ఆర్‌పై అతివేగంగా డివైడర్‌ను ఢీకొనడంతో ఓంకార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురు స్నేహితులకు తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## చెరువులో పడి మత్స్యకారుడు మృతి

రేగొండ, ఫిబ్రవరి 16 : మండలంలోని కొడవటంచ గ్రామానికి చెందిన మత్స్యకారుడు పోలు ఓదేలు(46) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఓదేలు గ్రామ శివారులోని కోనేటి చెరువులో చేపలు పట్టేందుకు ఆదివారం వెళ్లాడు. చేపల కోసం వల విసిరే క్రమంలో వలలో చిక్కుకుని ఊపిరి ఆడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఓదెలుకు భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అమెరికా అమ్మాయి.. హనుమకొండ అబ్బాయి

**మూడుముళ్లతో ఒక్కటైన జంట**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : వారిద్దరూ ప్రేమించుకున్నారు. ఖండాలు వేరైనా వారి మనసులు కలిశాయి. ఆదివారం మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన యువతిని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన యువకుడు వివాహం చేసుకున్నాడు. నీరుకుళ్లకు చెందిన తాటిపర్తి రఘునాథ్‌రావు- వైశాలి దంపతుల కుమారుడు సతీశ్ ఉన్నత చదువుల కోసం పదేళ్ల క్రితం అమెరికాకు వెళ్లాడు. అక్కడ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. 2021లో ఫ్లోరిడా రాష్ట్రానికి చెందిన జెస్సికతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తగా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో హిందూ సంప్రదాయం ప్రకారం హనుమకొండలోని ఏఆర్ఆర్ గార్డెన్స్‌లో మూడుముళ్ల బంధంతో వారిద్దరూ ఒక్కటయ్యారు. హిందూ సంప్రదాయ ప్రకారం పెళ్లి చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని పెళ్లికూతురు జెస్సిక అన్నారు. ఇండియాలో మూవీస్ చూశానని, అందులో పుష్ప సినిమా అంటే ఎంతో ఇష్టమని 'తగ్గేదేలే' అంటూ డైలాగ్ చెప్పి అందరినీ మంత్రముగ్ధులను చేసింది.



హిందూ సంప్రదాయం ప్రకారం ఒకటైన సతీశ్, జెస్సిక

## 20న చలో 'విద్యుత్ సౌధా'ను విజయవంతం చేయాలి

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 16 : టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న విద్యుత్ సౌధా సభ కార్యక్రమానికి జిల్లాలోని ఆర్టిజన్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీవీఏసీ జేఏసీ జిల్లా కన్వీనర్ మోత్కూరి కోటి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చలో విద్యుత్ సౌదా సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా టీవీఏసీ జేఏసీ జిల్లా కన్వీనర్ కోటి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రస్తుత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, బట్టి విక్రమార్క, సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆర్టిజ న్స్ ఎండీ అంకుషావలి, సురేందర్‌రెడ్డి, మ చ్చిక వెంకటేశ్వర్లు, బత్తుల రాజేందర్, జేఏల్ ఎం శ్యామ్, వేణు, శ్రీనివాస్, రంజిత్, దేవేందర్, రైతు సంఘం నాయకులు భిక్షపతి, రాజేందర్, సమ్మయ్య, కుమార్ పాల్గొన్నారు.




వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

## గోసంగి జిల్లా కార్యవర్గం ఎన్నిక

గోవిందరావుపేట, ఫిబ్రవరి 16 : మండలకేంద్రంలో ఆదివారం గోసంగి కుల జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జన్నారపు రమేశ్, ప్రధాన కార్యదర్శిగా మెండెద్దుల రమేశ్, గౌరవ అధ్యక్షులుగా జన్నారపు సదానందం, వెంకటస్వామిలను ఎన్నుకున్నారు. గోదా కనకయ్య, జన్నారపు రాజ్‌కుమార్, పుష్పలీల, సతీశ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

## జబ్బోనిగూడెం-నెమళ్లగుట్ట రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలి

మంగపేట, ఫిబ్రవరి 16 : మండలంలోని జబ్బోనిగూడెం-నెమళ్లగుట్ట రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని స్థానిక గిరిజనులు, పలువురు రైతులు కోరుతున్నారు. జబ్బోనిగూడెం నుంచి నెమళ్లగుట్ట సమ్మక్క గుడి వరకు సుమారు 4కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. దీంతో ఈ ప్రాంత పంట పొలాలకు వెళ్లే రైతులు నిత్యం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల జరిగిన సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు కూడా ఇబ్బందులు పడ్డారు. జామాయిల్ తోటలు సాగు చేసిన రైతులు కూడా ఆ కలపను ట్రాకర్ల ద్వారా మెయిన్ రోడ్డు వరకు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. రోడ్డు మొత్తం గుంతలమయంగా ఉండటంతో కలప లోడుతో వస్తున్న ట్రాక్టర్లు తరచూ బోల్తా పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతులు, ఈప్రాంత ప్రజల సమస్యపై దృష్టి సారించి, బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఇటీవల గుంతల్లో బోల్తాపడిన ట్రాక్టర్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE



★ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime Schoolకు ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666/8309035091

NTW-27793

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565